క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నారాయణపేట రూరల్: గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి పడ్డ పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. మండలంలోని కోటకొండ పంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డికి ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందించారు. జీపీ కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, సరైన సమయానికి వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారిందన్నారు. వెంటనే రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, నాగప్ప, కృష్ణయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లకు ముగిసిన శిక్షణ



ఊట్కూరు: పట్టణంలోని రైతువేదిక భవనంలో మూడు రోజులుగా కొనసాగుతున్న అంగన్వాడీ టీచర్ల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. సీడీపీఓ జయ ఆధ్వర్యంలో పడాయి, పోషణ, దివ్యాంగ బాలల సంరక్షణ తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణ ముగింపు సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో పోషకాహారంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రాజేశ్వరి, గీత, చంద్రకళ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

'భగత్‌సింగ్ చౌరస్తా' పేరునే కొనసాగించాలి

మక్తల్: పట్టణంలో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న రోడ్డుకు భగత్‌సింగ్ చౌరస్తా పేరునే కొనసాగించాలని హిందుధార్మిక సంఘాల నాయకులు కోరారు.ఈ మేరకు గురువారం సీఐ రాంలాల్, కమిషనర్ నర్సింములుకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 17న కొందరు ఆ రోడ్డుపై పెరియార్ చౌరస్తా అని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని, దానిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బాల్‌రాంరెడ్డి, మండల అర్బన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాంమాదవ్, కావాలి వెంకటేష్, నర్సింహ్మారెడ్డి, పాలరఘు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



దామరగిద్ద: మండలంలోని మొగుల్‌మడ్క గ్రామానికి చెందిన అంజమ్మ అంబులెన్స్‌లో ప్రసవించింది. గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ తాజోద్దీన్, పైలట్ రవికుమార్ అప్రమత్తమై వైద్యసేవలు అందించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి



మద్దూరు: మండలంలోని నందిపాడ్ గ్రామంలో శతాధిక వృద్ధుడిగా పేరు గాంచిన రాసూరి పెద్ద కిష్టప్ప(103) గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఏడాది క్రితం వరకు తన పనులు తానే చేసుకునే వాడని, ఆరు నెలలుగా వయోభారం కారణంగా ఇంటికే పరిమితమైనట్లు కుమారుడు రాసూరి కన్కప్ప తెలిపాడు. వయోభారం కారణంగా ఇటీవల అస్వస్థతకు గురికాగా గురువారం మృతి చెందినట్లు తెలిపారు. పెద్ద కిష్టప్పకు నలుగురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నాడు.

మార్కెట్ యార్డులో భవనం పరిశీలన

మక్తల్: మక్తల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న హోటల్ భవనానికి మరమ్మతు చేసేందుకు చర్యలు చేపడతామని మార్కెట్ యార్డు డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎండీ సాలం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం మొత్తం దెబ్బతినగా గురువారం భవనాన్ని మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంటనే పాలక వర్గం సమావేశం ఏర్పాటు చేసి భవనానికి మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గదులుండవు.. చదువులు సాగవు



చిన్నపొర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- పీఎంశ్రీ జెడ్పీ పాఠశాలలో తరగతి గదులు, మరుగుదొడ్లు లేక ఇక్కట్లు
- ఒక్కొక్క గదిలో 100 మంది విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

ఊట్కూరు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం ఒకవైపు కృషి చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యంతో ఆ ఆశయం నెరవేరడం లేదు. మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 428 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 6వ తరగతిలో 58, 7వ తరగతిలో 68, 8వ తరగతిలో 76, 9వ తరగతిలో 121, 10వ తరగతిలో 102 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఇంతమంది విద్యార్థులకు కేవలం ఐదు గదులు మాత్రమే ఉండగా వాటిలోనూ వర్షాకాలం వస్తే రెండు గదులు లీకేజీ అవుతున్నాయి. దీంతో విద్యార్థులు కూర్చోడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. కొత్త బెంచీలు మంజూరైన స్థలం సరిపోక నిరుపయోగంగా ఉంచేశారు. మధ్యాహ్న భోజనం వండడానికి వంటపాత్రలు కూడా లేకపోవడంతో నిర్వాహకులు కిరాయి పాత్రలు తెచ్చి వంట వండుతున్నారు. నెలకు రూ.8వేలు కిరాయికే చెల్లిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

పాఠశాలలో దాదాపు 428 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంతమంది విద్యార్థులకు కేవలం 10 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. ఇతర పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి సెక్షన్‌లుగా విభజించి విద్యాబోధన చేస్తుంటారు. అయితే ఇక్కడ విద్యార్థులకు సంఖ్యకు తగ్గట్లు తరగతి గదులు లేకపోవడంతో సెక్షన్లు ఏర్పాటు చేయకుండానే విద్యాబోధన చేస్తుండడంతో నాణ్యమైన విద్య అందడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అయితే ఇటీవల పాఠశాల ఉపాధ్యాయ బృందం మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి పాఠశాల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించి ఇతర మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పాఠాలు అర్థం కావడం లేవు

నేను 9వ తరగతి చదువుతున్నాను. మా తరగతిలో మొత్తం 121 మంది విద్యార్థులు ఉన్నారు. అందరూ ఒకే గదిలో కూర్చోవడానికి ఇబ్బందిగా ఉంది. ఇరుకురుకుగా కూర్చోవడం వల్ల పాఠాలు సరిగా అర్థం కావడం లేవు. సెక్షన్‌లుగా విభజించి విద్యాబోధన చేస్తే బాగుంటుంది.

–నరేందర్, చిన్నపొర్ల

మరుగుదొడ్లు నిర్మించాలి

పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. 428 మంది బాలబాలికలకు రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. అధికారులు స్పందించి మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలి.

–కల్యాణి, 10వ తరగతి, చిన్నపొర్ల

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. ఇటీవల మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి కూడా వినతిపత్రం అందజేశాం. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరిస్తే విద్యార్థుల ఇబ్బందులు తీరుతాయి.

–సత్యనారాయణ , ప్రధానోపాధ్యాయులు

'పీఎం స్వనిధి'ని సద్వినియోగం చేసుకోవాలి



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ అనంత్‌నాగ్

కోస్గి రూరల్: పీఎం స్వనిధి పథకాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ మేనేజర్ అనంత్‌నాగ్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారులకు రుణం ఎలా పొందాలి, ఆర్థిక క్రమశిక్షణ, డిజిటల్ చెల్లింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పీఎం స్వనిధి ద్వారా మొదటి విడతలో రూ.15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ రుణం కోసం ఏలాంటి పత్రాలు, ష్యూరిటీ అవసరం లేదన్నారు. కార్యక్రమంలో పురకమిషనర్ నాగరాజు, టీజీబీ మేనేజర్ మొగులయ్య, టీజీబీ ఫీల్డ్ అధికారి దినేష్, సీఓ మహిమూద్, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవాను విజయవంతం చేద్దాం



స్వచ్ఛత పనులు చేస్తున్న కొండయ్య

నర్వ: స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రామస్తుల సహకారంతో శ్రమదానాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలతో పాటు చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మక్తల్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం

మక్తల్: ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొని పోస్టాఫీస్ కార్యాలయాన్ని శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించి కంపచెట్లను నరికి వేశారు. కార్యక్రమంలో అర్బన్ మండల అధ్యక్షుడు రాజశేకర్‌రెడ్డి, కల్లూరినాగప్ప, మహేష్‌సాగర్, పీకే నర్సింహ, బ్యాటరి రాజు, రేనుక నర్సింహా, కొండయ్య, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

వెదురు వనాలతో పర్యావరణానికి మేలు



వెదురు వనాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

కోస్గి: వెదురు వనాలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని జాతీయ హరితదళ సమన్వయ కర్త వార్ల మల్లేశం అన్నారు. గురువారం 'ప్రపంచ వెదురు వనాల సంరక్షణ దినోత్సవం' సందర్భంగా మండల పరిధిలోని మీర్జాపూర్ పాఠశాలలో విద్యార్థులకు వెదురుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో ఉన్న వెదురు వృక్షాల దగ్గరకు తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో పర్యావరణంలో వెదురు వనాల పాత్ర అనే అంశంపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. చేతి వృత్తులు, ఔషధాల తయారిలో అలాగే ఫర్నిచర్ తయారిలో వెదురును విరివిగా వినియోగిస్తారని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వెదురు దినోత్సవ వేడుకలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా సాయిబాబా మందిరం దగ్గర పేదలకు ప్లేట్లు పంపిణీ చేశారు. అనంతరం మహేంద్ర సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ... ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించి వెదురు ఉత్పత్తులను వాడి కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. సూర్యకాంత్, వెంకట్రాములు, మధుసూదన్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి

నారాయణపేట: తమ సమస్యల పరిష్కారానికి ఈనెల 22న చేపట్టిన చలో హైదరాబాద్ (ఎస్‌పీడీ కార్యాలయం) ముట్టడికి జిల్లాలోని కేజీబీవీ కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎల్ పద్మ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేజీబీవీ పాఠశాల కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి కేజీబీవీ ఉద్యోగులు సోమవారం హైదరాబాద్ తరలిరావాలన్నారు.

కార్యాలయం.. పిచ్చిమొక్కల మయం



స్వచ్ఛభారత్, పల్లెప్రగతి పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు కేటాయించి పచ్చదనంతో పాటు పరిశుభ్రత పెంపొందించడానికి కృషి చేస్తున్నాయి. అయితే కొందరు అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణం మొత్తం పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయినా అధికారులు పట్టించుకోకుండా స్వచ్ఛభారత్‌ను గాలికొదిలేశారు. దీంతో పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు కొద్దిసేపు సేదతీరుదామంటే దోమలతో యుద్ధం చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- మాగనూర్

బహిరంగ చర్చకు సిద్ధం

కృష్ణా: మండలంలో నెలకొన్న సమస్యలపై బహిరంగ చర్చకు సిద్ధమని బీజేపీ జాతీయకౌన్సిల్ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్, బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ అంబ్రేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో రోడ్డు, తాగునీరు, భవనాల నిర్మాణాలు ఇలా ప్రతి అంశంపై కాంగ్రెస్ నాయకులతో తాము చర్చకు సిద్ధమని ప్రకటించారు. చర్చ ఎక్కడ, ఎప్పుడు అనేది వారే చెప్పాలన్నారు. తాము రాజకీయాలు చేయడం లేదని అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి శాంతియుతంగా నిరసన తెలియచేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎల్‌ఈడీ టీవీ వితరణ



నారాయణపేట టౌన్: నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల పరిశీలన నిమిత్తం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ ఆదేశాల మేరకు ఫౌండేషన్ సభ్యులు గురువారం ఎస్ఐ రాములుకు ఎల్‌ఈడీ టీవీని అందజేశారు. ఈ మేరకు ఫౌండేషన్ సభ్యుడు గద్దం తిప్పన్న మాట్లాడుతూ.. సీసీ కెమెరాల పరిశీలన నిమిత్తం టీవీ అవసరమని ఎస్ఐ చేసిన విజ్ఞప్తి మేరకు ఎల్‌ఈడీ టీవీని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు హన్మంతు, కృష్ణ యాదవ్, సంతోష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



నారాయణపేట రూరల్: పట్టణంలోని బాపూనగర్‌లో బ్రహ్మకమలం వికసించింది. బాపూనగర్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ వెంకటయ్య గతంలో ఒక మొక్కను తీసుకొచ్చి నాటారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి బ్రహ్మకమలం వికసించింది. అరుదుగా పూసే ఈ పువ్వును చూడటానికి చుట్టుపక్కల ప్రజలు తరలివచ్చారు. పువ్వునకు మహిళలు హారతి ఇచ్చి పూజలు చేశారు. అనంతరం కమలాన్ని సమీప దేవాలయంలో అందజేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బ్రహ్మకమలం వికసించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం

మరికల్: జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అప్పంపల్లి తిరుపతిరెడ్డిని గురువారం మండల బీజేపీ నాయకులు మరికల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సేవపక్షం కార్యక్రమంలో భాగంగా మరికల్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేణు, రాజేష్, రమేష్, సురేష్, చెన్నయ్య, సూరి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల్లో భూ భారతి పేరుతో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు ఇచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి రామకృష్ణ, ఏఐయుకేఎస్ మండల అధ్యక్షుడు తాయప్ప కోరారు.ఈ మేరకు గురువారం సీఏఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ, అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి తీసుకొస్తే అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, మహేష్, రాజు, నరసింహా, ఉసేనప్ప, బుగ్గప్ప, శ్యామప్ప, తిప్పణ్ణ, బాలప్ప, రాజు కన్నప్ప పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ గేమ్స్



క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు

దామరగిద్ద: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ గేమ్స్ ఎంతగానో ఉపయోగపడతాయని జీహెచ్‌ఎం సురేష్, పీఏసీఎస్ చైర్మన్ ఈదప్ప, ఎస్ఐ రాజులు అన్నారు. గురువారం మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 ,17 విభాగంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయా స్థాయి క్రీడల్లో ప్రతిభకు కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతి, పీడీ బాల్‌రాజ్, వేణుగోపాల్, శశిధర్‌రెడ్డి, శంభులింగం, పీఈటీలు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి



పశుసంవర్ధకశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నారాయణపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో గొర్రెలు, మేకలు రోగాలబారిన పడి మృత్యువాత పడుతున్నాయని, రోగాల బారి నుంచి రక్షించేందుకు మందులను అందుబాటులో ఉంచాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ అనిరుధ్‌కు గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ మహేష్ కుమార్ యాదవ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రోగాల బారిన పడిన జీవాలను కాపాడేందుకు డాక్టర్లను మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. రోగాల బారినపడి జీవాలు చనిపోతుండడంతో పెంపకందారులు నష్టపోతున్నరని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటివల బొమ్మన్ పాడులో ఎలుగుబంటి దాడిలో 25 గొర్రెలు, ధన్వాడ మండల పరిధిలోని హనుమన్ పల్లిలో కలుషిత నీటిని తాగి 50 గొర్రెలు మృతి చెందాయన్నారు. నాయకులు భీమ్ రాజ్ , కనకప్ప, గోవిందు మల్లేష్ ఉన్నారు.

హిందీ భాషపై పట్టు సాధిద్దాం



హిందీ ప్రచార సమితిలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న సిబ్బంది



పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

నారాయణపేట రూరల్: హిందీ భాషపై ప్రతిఒక్కరూ పట్టుసాధించాలని రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయుడు, హిందీ ప్రచార్ సమితి కార్యదర్శి సుఖ్‌దేవ్ అన్నారు. హిందీ దివస్ సందర్భంగా గురువారం హిందీ ప్రచార సమితిలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. తొలి రోజు చిత్రలేఖనం, క్విజ్, ఉపన్యాస పోటీలను నిర్వహించగా పట్టణంలోని 210 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ భాషలను సమన్వయపరచడంలో హిందీ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు బలవీర్, శంకర్, విశల్ రావు, విద్యాసంస్థల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం

కోస్గి: జాతీయ హిందీ భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా విద్యార్థులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం హింది ఉపాధ్యాయుడు డాక్టర్ రాకేశ్ కుమార్ మాట్లాడుతూ హిందీని దేశ భాషగా రాజ్యాంగం గుర్తించి అమలులోకి వచ్చిన సెప్టెంబర్ 14న జాతీయ హిందీ భాష దినంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు హిందీలో ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఓటింగ్ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన



మరికల్: మండలంలోని కన్మనూర్ ఉన్నత పాఠశాలలో ఓటింగ్ విధానంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసి, రాజకీయ పార్టీల అభ్యర్థుల ఏజెంట్లు, అధికారులు, పోలీసుల పర్యవేక్షణ తదితర వాటి గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం మాక్ పోలింగ్ జరిపించి ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించారు.

బీజేపీకి మూకుమ్మడి రాజీనామాకు సిద్ధం

ఊట్కూర్: జిల్లా నూతన కమిటీల్లో ఊట్కూర్ మండాలనికి చెందిన ఏ కార్యకర్తకు స్థానం కల్పించకపోవడంతో బీజేపీకి మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఉమ్మడి జిల్లాలోని ఊట్కూర్ బీజేపీకి మొదట నుంచి కంచుకోటగా ఉందని, ఉట్కూరు కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేస్తే ఇప్పటికి పని మానుకొని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. పార్టీ బలోపేతానికి మొదట నుంచి ఎంతో కృషి చేసిన కార్యకర్తలకు జిల్లా కమిటీలో చిన్న పదవి ఇవ్వకపోవడంతో కార్యకర్తలు అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుకు తెలియజేస్తామన్నారు. జిల్లా కమిటీని రద్దు చేయాలని లేని పక్షంలో రెండు రోజుల్లో మండాలనికి చెందిన కార్యకర్తలందరూ మూకుమ్మడి రాజీనామాకు సిద్ధమని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కోస్గి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పర్యటించి ఇటీవల మరణించిన పార్టీ నాయకుల కుటుంబ సభ్యులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. పోతిరెడ్డిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ శంకరయ్య కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. నాగుసాన్‌పల్లితోపాటు పలు గ్రామాల్లో రోడ్డు ప్రమాదానికి గురైన, అనారోగ్యం బారిన పడిన నాయకులు, కార్యకర్తలను స్వయంగా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకట్ నర్సింములు, దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ మహిపాల్, మాజీ వైస్ ఎంపీపీ సాయిలుతో పాటు పలుగ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవల కోసమే పల్లె దవాఖానా

కోస్గి: ప్రభుత్వం పేద ప్రజలందరికీ కార్పోరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని, ఇందులో భాగంగానే పల్లె దవఖానాలు ఏర్పాటు చేస్తుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చంద్రవంచలో రూ.20 లక్షలతో ఎన్‌హెచ్‌ఎమ్ నిధులతో నూతనంగా నిర్మించిన పల్లె దవఖానను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పల్లె దవఖానాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్దన్‌రెడ్డి, డీపీఓ భిక్షపతి, పల్లె దవఖాన వైద్యురాలు వైష్ణవి, ఏఎన్‌ఎం మాదవి తదితరులు పాల్గొన్నారు.

